పేదలకు పెద్ద దిక్కు !

- 'పురం' జిల్లా ప్రభుత్వాస్పత్రిలో నాణ్యమైన వైద్యసేవలు
- వృద్ధులు, చిన్నారులపై ప్రత్యేక దృష్టి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పెద్దాస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య

	తేదీ	ఓపీ	ఐపీ
జూలై	26	772	69
జూలై	27	804	74
జూలై	28	881	76
జూలై	31	1221	79
ఆగస్టు	1	869	87
ఆగస్టు	2	1006	77
ఆగస్టు	3	988	91
ఆగస్టు	4	901	87
ఆగస్టు	5	884	79


ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు


మందులు తీసుకోవడానికి బారులు తీరిన రోగులు

హిందూపురం టౌన్: పట్టణంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పేదలకు పెద్ద దిక్కుగా నిలుస్తోంది. వివిధ జబ్బులతో ఆస్పత్రికి వస్తున్న వారికి ఇక్కడి వైద్యులు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మూడు నియోజకవర్గాల నుంచే ఎక్కువ...

మడకశిర, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లోని వారు ఎక్కువగా హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికే వస్తుంటారు. ప్రస్తుతం ముఖ్యంగా వాతావరణ మార్పులతో చిన్నపిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతూ హిందూపురంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వస్తున్నారు. హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రస్తుతం ప్రతి రోజూ వెయ్యికి పైగా రోగులు ఆస్పత్రికి చికిత్సకు వస్తున్నారు. వీరిలోనూ చిన్నపిల్లలు అధికంగా వస్తున్నారు. చిన్న పిల్లల ఓపీ రోజుకు 110 నుంచి 130 వరకూ ఉంటోంది.

డిశ్చార్జ్‌లూ ఎక్కువే...

ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీకి వచ్చే రోగుల సంఖ్యలో పాటు అడ్మిషన్లు పొందే రోగుల సంఖ్య ఎక్కువగానే ఉంది. రోజుకు ఆస్పత్రిలో 70 నుంచి 90 మంది దాకా రోగులు అడ్మిషన్లు పొంది చికిత్స పొందుతున్నారు. రోగులతో అత్యవసర విభాగం, ఓపీ గదులు, ల్యాబ్‌లు, మందుల గది, వార్డులు నిండుకున్నాయి. సీజనల్ వాధ్యులతో నేపథ్యంలో ల్యాబ్‌లలో వివిధ రకాల నిర్ధారణ పరీక్షలు పెరిగాయి. అయితే ఐపీ రోగుల అడ్మిషన్లతో పాటు డిశ్చార్జులు సైతం ఎక్కువగా ఉంటున్నాయి. వైద్యులు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తుండటంతో 60 నుంచి 70 మంది రోగులకు ప్రతిరోజూ ఆస్పత్రి నుంచి జబ్బుల నుంచి కోలుకొని డిశ్చార్జ్ అవుతున్నారు.

మెరుగైన వైద్యమందిస్తున్నాం



హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి ప్రతిరోజూ సీజనల్ జ్వరాల బారిన పడుతూ వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. అలాగే డిశ్చార్జులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లతో పాటు ఓపీకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాం. రక్తపరీక్షలు నిర్వహించి జబ్బును నిర్ధారించుకుని చికిత్సలను అందజేస్తున్నాం. చిన్నపిల్లల వార్డుపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నాము. వైద్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

– డాక్టర్ రోహిల్ కుమార్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, హిందూపురం

నిందితులను అరెస్ట్ చేయాలి


పోలీస్‌స్టేషన్ దగ్గర ఆందోళన చేస్తున్న బాధితులు

పావగడ: పట్టణంలోని బోవి కాలనీకి చెందిన కొరచ శ్రీనివాస్ (35) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబీకులు శ్రీనివాస్ మృతికి కారణమైన నిందితులను అరెస్ట్ చేయాలని శ్రీనివాస్ మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఇదిలా ఉంటే మూడు రోజుల క్రితం జరిగిన ఓ వర్గానికి చెందిన వ్యక్తులు శ్రీనివాస్‌పై దాడి చేసినట్లు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలపాలై బెంగుళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన కుమారుని చావుకు కారణమైన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని మృతుడి తండ్రి మారెప్ప డిమాండ్ చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక జేడీఎస్ నాయకుడు సొగడు వెంకటేశ్ మాట్లాడుతూ వెంటనే పోలీసులు శ్రీనివాస్ మృతిని హత్య కేసుగా నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో రాజకీయాలకు తావులేదన్నారు.

క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ విజేత కొండూరు


కప్‌ను అందుకున్న విజేతలు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రంలో జై శ్రీరామ్ ఆధ్వర్యంలో కరణం రామానందన్ స్వామి సహకారంతో గత వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ పోటీల్లో 16 జట్టు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో చోళసముద్రం -కొండూరు జట్లు తలపడ్డాయి. కొండూరు జట్టు విన్నర్‌గా, చోళసముద్రం జట్టు రన్నర్‌గా నిలిచారు. విన్నర్ జట్టుకు రూ.20 వేలు, రన్నర్‌కు రూ.10 వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు.

విద్యార్థినికి అభినందన

గుడిబండ: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన శ్రేష్ఠ పరీక్షలో జాతీయస్థాయిలో పీసీ గిరి గ్రామానికి చెందిన రమ్యశ్రీకి 1200 ర్యాంకు సాధించింది. ఇందులో భాగంగానే మడకశిర సాయి అక్షర జూనియర్ కళాశాల సిబ్బంది రమ్యశ్రీతో పాటు తండ్రి రంగనాథ్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. దేశంలోనే అత్యున్నత కళాశాలలో ఒకటైన తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో ఉన్న వేలమ్మాల్ రెసిడెన్సియల్ కళాశాలలో సీటు సాధించడం గొప్ప విషయమని ఉపాధ్యాయులు కొనియాడారు.

శస్త్ర చికిత్సకు 37 మంది ఎంపిక


శిబిరంలో పాల్గొన్న వైద్యులు

పావగడ: స్థానిక హెల్ప్ సొసైటీ, బెంగుళూరు దేవనహళ్లిలోని ఆకాశ్ ఆస్పత్రి సంయుక్తంగా తాలూకాలోని వెంకటాపురం గ్రామం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య చికిత్స శిబిరానికి దాదాపుగా 400 మంది హాజరుకాగా 37 మందిని వివిధ శస్త్రచికిత్సకు ఎంపికయ్యారు. ఆకాశ్ ఆస్పత్రి వైద్య నిపుణులు పవన్, అర్పిత, వైజయంతి సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు ఈ శిబిరాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ మానం వెంకటస్వామి ప్రారంభించారు.

లారీ బోల్తా - తప్పిన ప్రమాదం



లారీ బోల్తా పడిన దృశ్యం

మడకశిర: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఓ లారీ బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. లారీ కొంత వరకు దెబ్బతింది. స్థానిక పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సందర్భంలో ఓవర్ లోడ్‌తో వెళుతున్న పలు లారీలను ఆపి పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. ఈ సమయంలో ఓ లారీ రివర్స్ తీసుకొంటుండగా ప్రమాదవశాత్తూ డ్రైనేజీలో ఇరుక్కొని బోల్తా పడింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టం జరుగకపోవడంతో పోలీసులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నులిపురుగుల నివారణపై నేడు అవగాహన

రొళ్ల: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 1 గంటకు నులిపురుగుల నివారణపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంఈఓ-2 శ్రీధర్ తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు అవగాహనా కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని కోరారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాలైన శిర, హిరియూర్, బెంగళూరు, తుమకూరు, మధుగిరి, పావగడ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దృశ్యం

గోరంట్ల: స్థానిక వినాయకనగర్ సమీపంలో ఉన్న షిర్డీసాయిబాబా ఆలయ అభివృద్ధికి ఏపీఎన్‌జీఓ మాజీ ఉప అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బారెడ్డి దంపతులు రూ.50 వేల విరాళం ప్రకటించారు. ఇందులో భాగంగానే ఆ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులు కిష్టప్ప, వెంకటస్వామి, శంకర్ , సుబ్రమణ్యం స్వామి, శివప్ప తదితరులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను అభినందించారు.

చల్ చల్ గుర్రం.. చలాకీ గుర్రం


గుర్రంపై స్వారీ చేస్తున్న యువకుడు

పరిగి: హిందూపురంలోని రహమత్‌పూర్‌కు చెందిన ఓ యువకుడు పరిగి మండలంలో గుర్రపు స్వారీ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నాడు. అతను రోడ్డుపై గుర్రంపై స్వారీ చేస్తుండటాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. రహమత్‌పూర్‌కు చెందిన యువకుడు (పేరు చెప్పడానికి నిరాకరించారు) మాట్లాడుతూ గతంలో తన తండ్రి దగ్గర దాదాపు ఇరవై గుర్రాలు ఉండేవన్నారు. ప్రస్తుతం తామెక్కడికి వెళ్లాలన్నా గుర్రంపైనే ప్రయాణిస్తున్నట్లు పేర్కొన్నాడు. ఇప్పటికీ తమ దగ్గర 20 గుర్రాలు ఉన్నాయన్ని చెప్పాడు. రేసులకు తమ గుర్రాలకు మంచి గిరాకీ ఉందన్నాడు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా సుధాకర్



పెనుకొండ: జిల్లా యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శిగా సుధాకర్ ఎంపికయ్యారు. పెనుకొండలో ఆదివారం యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం సమావేశం జరిగింది. ఇందులో భాగంగానే సుధాకర్‌ను ఉపాధ్యాయ సంఘం నాయకులు జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'షాపింగ్ కాంప్లెక్స్' నూతన కమిటీ ఎన్నిక

హిందూపురం: హిందూపురం న్యూ కమర్షియల్ మున్సిపల్ మార్కెట్ కాంప్లెక్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.బి.రెహిమాన్, ఉపాధ్యక్షులుగా వినయ్, కార్యదర్శిగా నాగిరెడ్డి, సహాయకార్యదర్శిగా ఇమ్రాన్, కోశాధికారిగా చంద్రమోహన్, గౌరవధ్యక్షులుగా సూర్యనారాయణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డిని కలిసి సన్మానించి కమిటీని పరిచయం చేశారు.

భగవద్గీతపై ప్రచారం

పరిగి: మండలంలోని పైడేటి గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత పై ప్రచారం నిర్వహించారు. హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన సభ్యులు ఆదినారాయణ, మునీంద్ర, శేఖర్, సుభద్ర, కోణమ్మ, నాగమ్మ, కాలక్క, చౌడమ్మ, సుబ్బమ్మ, లీలక్క తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే తిప్పేస్వామి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: మడకశిర నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం చందకచెర్లు గ్రామంలో నాయకులతో కలిసి ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ నియోజకవర్గంలో 76 గ్రామ ,వార్డు సచివాలయాలుండగా ఇప్పటికే 63 సచివాలయాల పరిధిలో ప్రజల మద్దతుతో విజయవంతంగా గడప గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ మండలాల్లో 13 గ్రామ సచివాలయాలు ఉన్నాయని అవి కూడా వచ్చే నెలలోపు పూర్తి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నవరత్నాల్లో భాగంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు పైసా ఖర్చు లేకుండా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సక్రమంగా అందుతున్నాయని ప్రజలు గడప గడపకూ కార్యక్రమంలో చెబుతున్నారని తెలిపారు. గడప గడపకూ కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన ప్రధాన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. ఏ గ్రామాలనికి వెళ్లినా ప్రజలు సంతోషంతో ఆహ్వానిస్తున్నారని తెలిపారు. మడకశిర ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు రామిరెడ్డి, ఎంపీపీ కవిత, సర్పంచ్ ప్రభావతిభాయి తదితరులు పాల్గొన్నారు.

శుభ కార్యం

చందకచెర్లు ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం ఎమ్మెల్యే తిప్పేస్వామి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తిమ్మారెడ్డి సతీమణి సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చిలమత్తూరు: మండల కేంద్రంలోని శ్రీపొట్టిశ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్‌కు చెందిన వారు పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తీపి జ్ఞాపికాలను నెమరు వేసుకున్నారు. అనంతరం వారు మార్కెట్ యార్డుకు సంబంధించిన క్రీడా మైదానంలో మొక్కలను నాటి నీరు పోశారు.

రేపు మండల సర్వ సభ్య సమావేశం

గోరంట్ల: మండల సర్వ సభ్య సమావేశాన్ని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథగుప్తా పేర్కొన్నారు. మండల సమగ్ర అభివృద్ధిపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న పురోగతికి సంబంధించిన సమగ్ర సమాచారంతో అధికారులు హాజరుకావాలన్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తప్పక హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళపై దాడికి యత్నం

పావగడ: వెళ్లేందుకు దారి వదలమని అడిగిన ఓ మహిళపై ఓ వ్యక్తి దాడికి యత్నించిన సంఘటన తాలూకా పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. తాలూకాలోని తిమ్మమ్మనహళ్లి నుంచి ఉప్పారహళ్లికి వెళ్లే మార్గంలో సుబ్బయ్య అనే వ్యక్తికి పొలం ఉంది. అయితే తన చేను నుంచే అటుగా వెళ్లే వారికి దారి ఉండటంతో ఎవరినీ వెళ్లనివ్వకుండా మార్గమధ్యలో రాళ్లు వేశాడు. ఈ నేపథ్యంలో అటు గా వెళ్తున్న అక్కమ్మ అనే మహిళ దారి వదలమని కోరగా తాను వదలనని సుబ్బయ్య తేల్చి చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో కోపోద్రిక్తుడైన సుబ్బయ్య ఆమెపై బండ రాయితో దాడి చేశాడు. అయితే ఆమె దాడి నుంచి తప్పించుకుని కిందకు పడింది. ఈ ఘటనలో ఆమె నడుము, కాలికి తీవ్రగాయాలయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆమె తిరుమణి పోలీస్‌స్టేషన్‌లో సుబ్బయ్యపై ఫిర్యాదు చేశారు. నిందితుడు సుబ్బయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

హిందూపురం టౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీ వాసులు నూతనంగా టీచర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక టీచర్స్ కాలనీలో కౌన్సిలర్ సునీత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కాలనీ గౌరవాధ్యక్షుడిగా సెడియప్పన్, గౌరవ సలహాదారుడిగా శివారెడ్డి, అధ్యక్షుడిగా విశ్రాంత బ్యాంకు ఉద్యోగి ఫణిభూషణ శర్మలను ఎంపిక చేశారు. అలాగే కార్యదర్శిగా వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా హనుమంతరెడ్డి, మౌలాలి,సత్యనారాయణ, జేమ్స్, జాయింట్ సెక్రటరీగా రాఘవేంద్రరావు, ట్రెజరర్‌తో పాటు మరో 13 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి, ప్రధాన సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

19న చలివెందల గ్రామపంచాయతీ ఎన్నికలు

హిందూపురం: హిందూపురం మండలం చలివెందల పంచాయతీ ఉప ఎన్నికలు ఈనెల 19వ తేదీన నిర్వహించడానికి అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 8 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతుందని అధికారులు నోటిఫికేషన్‌లో తెలియజేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో చలివెందల గ్రామ సర్పంచ్‌గా సౌభాగ్యమ్మ అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. అయితే జూన్ 2022లో గుండెపోటుతో సౌభాగమ్మ మరణించారు. అప్పటి నుంచి సర్పంచ్ స్థానం ఖాళీ అయింది. తిరిగి ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

నేడు ప్రజా వేదిక

గోరంట్ల: మండల పరిషత్ కార్యాలయ ప్రాగణంలో సోమవారం ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ గుప్తా పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 2022-2023 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం ఇప్పటికే తనిఖీ పూర్తి చేసిందన్నారు. వివిధ శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో ప్రజా వేదికలో పాల్గొనాలన్నారు.

నిర్మాణ పనుల నిలిపివేత

రొద్దం: మండల కేంద్రంలోని పీర్ల చావడిలో కుళ్లాయిస్వామి పీర్లను భద్రపరచడానికి మొదలు పెట్టిన నిర్మాణ పనులపై వివాదం చెలరేగింది. పీర్ల చావడిలో నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం పోలీసులు అక్కడికి చేరుకొని పీర్ల చావడి నిర్మాణ పనులను నిలిపివేయించారు.

రంగనాథస్వామి గిరి ప్రదర్శన

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథస్వామి ఆలయ గిరిప్రదర్శన ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పూలరథంలో కొలువుదీర్చి గిరి ప్రదర్శన నిర్వహించారు. ఆలయ ఈఓ నాగేంద్ర, అర్చకులు గోవిందశర్మ, కమిటీ సభ్యులు నరసింహులు భక్తులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో సీసీ రోడ్డు

అగళి: మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాలలో ప్రభుత్వ నిధులతో మండల కోఆప్షన్ సభ్యుడు నాసిర్ సాబ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మరో 20 రోజుల్లో సిమెంట్ రోడ్డు పనులు పూర్తి చేసి పాఠశాలకు రోడ్డు సౌకర్యం కల్పించనున్నట్లు నాసిర్ సాబ్ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

పావగడ: క్రీడలతో మానసికోల్లాసం పొందవచ్చని స్థానిక పారిశ్రామికవేత్త మంజుల తెలిపారు. తాలూకాలోని దేవరబెట్ట గ్రామంలో ఆదివారం నిర్వహించిన టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యం కూడా పెంచుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీల్లో విజయం సాధించిన దేవరబెట్ట అవెంజర్స్ జట్టుకు మొదటి బహుమతి అందించారు. అలాగే ద్వితీయ బహుమతిని లెవెన్ టైగర్స్ జట్టుకు అందజేశారు.

ఘనంగా చిన్న పీర్ల పండుగ


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్లస్వాములు


పీర్లను జలధికి తరలిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో ఆదివారం చిన్న పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. పాత ఊరులో గత కొద్ది రోజులుగా కొలువదీరిన పీర్లను ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. పానకాలు, ప్రసాదాలు, భక్తులకు పంపిణీ చేశారు. పీర్ల చావిడి వద్ద చక్కెర చదివింపులతో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్థానిక చెరువులో జలధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానికులే కాకుండా చుట్టుపక్కన ఊళ్ల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

పరిగి: ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా స్థాయి పోటీలకు మండల విద్యార్థులు ఎంపికైనట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ మండల కార్యదర్శి కార్తీక్ తెలిపారు. ఆదివారం జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో మండలానికి చెందిన డీఎస్ లోక్‌నాథ్, కార్తీక్, దైవిక్‌రెడ్డి అనే విద్యార్థులు తమ సత్తా చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. మండల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రొద్దం: మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లిలో సోమవారం ఉదయం 9 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పెనుకొండ శాసన సభ్యులు మాలగుండ్ల శంకరనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన వివరించారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు తప్పక హాజరుకావాలని కోరారు.